
సాక్షి ఖమ్మం

శనివారం । 19 । జూలై । 2025



'రామదాసు'తో సాగు కళకళ

భక్త రామదాసు ప్రాజెక్టు ద్వారా పాలేరు జలాల ఎత్తిపోతలతో 70వేలకు పైగా ఎకరాల భూమికి సాగునీరు అందుతోంది. 8లో



టీచర్లు.. అటూఇటు

అవసరమైన పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్లను సర్దుబాటు చేసే విద్యాశాఖ అధికారులు కార్యాచరణ రూపొందించారు. 8లో

గరిష్టం / కనిష్టం 34° / 25°

వాతావరణం

జిల్లాలో శనివారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కొన్ని ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

పీహెచ్‌సీల్లోనే ప్రసవాలు జరగాలి

● కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్

కామేపల్లి: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అత్యధికంగా సాధారణ ప్రసవాలు జరిగేలా వైద్యాధికారులు కృషి చేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. కామేపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పశు వైద్య కేంద్రాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. తొలుత పీహెచ్‌సీ ఫార్మసీలో మందుల నిల్వలు, గర్భిణులకు అందుతున్న సేవలు, ల్యాబ్‌లో చికిత్సలపై ఆరా తీశారు. అలాగే, చికిత్స కోసం వచ్చిన వారితో మాట్లాడి వైద్యసేవలు తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటూ గర్భిణులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. జిల్లా ఆస్పత్రికి పంపించకుండా ఇక్కడే సాధారణ ప్రసవాలు ఎక్కువ సంఖ్యలో జరిగేలా చూడడం ద్వారా నమ్మకం పెంచాలని తెలిపారు. అనంతరం పశు వైద్యశాలను పరిశీలించగా, భవనం శిథిలావస్థకు చేరడంతో నూతన నిర్మాణానికి ప్రతిపాదించాలని ఆదేశించారు. అలాగే, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై కలెక్టర్ ఆరా తీశారు. తహసీల్దార్ సుధాకర్, వైద్యాధికారులు శిరీష, నాగులు, ఆర్‌ఐ సక్రు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న న్యాయమూర్తి చంద్రశేఖర్‌రావు

ఖమ్మంలీగల్: విద్యార్థి దశలో చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి కే.వీ.చంద్రశేఖర్‌రావు సూచించారు. ఖమ్మం దానవాయిగూడెంలోని మహాత్మాగాంధీ జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ బాలికల పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులు సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉంటూ చదువుపై దృష్టి సారించాలని, తద్వారా ఉన్నత స్థాయికి చేరాలన్నారు. అలాగే, బాల్య వివాహ నిషేధ చట్టం, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. పాఠశాల ప్రిన్సిపాల్ అరుణకుమారి, అధ్యాపకులు పాల్గొన్నారు.

టీపీఎస్‌ల ఏర్పాటుకు వసతుల పరిశీలన



విద్యార్థులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల, బనిగండ్లపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజ పరిశీలించారు. ఈ పాఠశాలలను ప్రభుత్వం తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు(టీపీఎస్)గా తీర్చిదిద్దాలని నిర్ణయించిన నేపథ్యాన అదనపు కలెక్టర్ ఇక్కడి వసతులు, విద్యార్థుల సంఖ్యపై సమీక్షించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల ఏర్పాటుతో విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి బోధన అందుతుందని తెలిపారు. అనంతరం బనిగండ్లపాడులో ఆస్పత్రి, జూనియర్ కళాశాలను తనిఖీ చేసి మరమ్మతులపై సూచనలు చేశారు. అలాగే, జమలాపురంలో శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో అదనపు కలెక్టర్ పూజలు చేశారు. మధిర మార్కెట్ చైర్మన్ బండారు నర్సింహారావు, విద్యాశాఖ అధికారులు విన్సెంట్, రామకృష్ణ, తహసీల్దార్ ఎం.ఉషాశారద, ఎంపీడీఓ బి.సురేంద్రనాయక్, ఎంఈఓ బి.మురళీమోహన్‌రావు, ఎంపీఓ జి.శ్రీలక్ష్మి, ఏపీఎం నాగరాజు, హెచ్‌ఎం ఎన్.జ్యోతిశ్రీ పాల్గొన్నారు.

మైనార్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ, ఉపాధి

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర మైనార్టీ స్టడీ సర్కిల్, మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యాన బ్యాంకింగ్, ఫైనాన్షియల్, ఇన్సూరెన్స్ రంగాల్లో మైనార్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వడమే కాక ఉపాధి కల్పించనున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి బి.పురందర్ తెలిపారు. ఇందుకోసం రెగ్యులర్ విధానంలో డిగ్రీ, పీజీ పూర్తి చేసిన అభ్యర్థులు నెలపాటు శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి ఉన్న వారు తమ దరఖాస్తులను వచ్చేనెల 18లోగా కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని, వివరాలకు 97040 03002 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

మరింత అడవి.. పచ్చదనం



బుగ్గపాడు బ్లాక్ ప్లాంటేషన్‌లో పెరుగుతున్న వెదురుమొక్కలు

● ఏటా కొత్తగా అటవీ ప్లాంటేషన్లు
● మొక్కల సంరక్షణకు ప్రత్యేక నిధులు
● ఉద్యాన యోజన పథకం కింద అర్బన్ ఫారెస్ట్ అభివృద్ధి

జిల్లాలో నాటుతున్న మొక్కలు 90శాతానికి పైగా బతుకుతుండడంతో పచ్చదనం నానాటికీ పెరుగుతోంది. మొక్కల పెంపకానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు పథకాల ద్వారా నిధులు కేటాయిస్తుండడంతో పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా అధికారులు ముందుకు సాగుతున్నారు. గత ప్రభుత్వం హరితహారం పేరుతో నిర్వహించిన మొక్కల పెంపకాన్ని ప్రస్తుత ప్రభుత్వం వన మహోత్సవంగా నిర్వహిస్తోంది. అన్ని ప్రభుత్వ శాఖలకు లక్ష్యాలు కేటాయించడమే కాక సామాజిక బాధ్యతగా ప్రజలను సైతం ఇందులో భాగస్వాములను చేస్తున్నారు.

– ఖమ్మంవ్యవసాయం

అటవీ ప్రాంతంలో..

రాష్ట్రంలో అటవీ ప్రాంతం అధికంగా ఉన్న జిల్లాల్లో ఉమ్మడి ఖమ్మం ముందు వరసలో నిలుస్తుంది. భౌగోళికంగా చూస్తే జిల్లా విస్తీర్ణంలో నాలుగు శాతం(62,115 హెక్టార్లు) అటవీ ప్రాంతం ఉంది. ఇక్కడ చల్క, దుబ్బ, నల్ల నేలలు వృక్ష సంపద, జంతుజాలానికి అనుకూలంగా ఉండడం కలిసొస్తోంది. అలాగే, రెండేళ్లుగా వన మహోత్సవం కార్యక్రమం కింద అటవీ భూముల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడుతున్నారు. సగటున ఏటా 5లక్షల మొక్కలను బ్లాక్ ప్లాంటేషన్ పేరిట అటవీ భూముల్లో నాటి సంరక్షిస్తుండడంతో పచ్చదనం, అటవీ విస్తీర్ణం పెరుగుతోంది. ఖమ్మం అటవీ సర్కిల్ పరిధిలోని ఖమ్మం, సత్తుపల్లి డివిజన్లలో 2024–25లో 7.60 లక్షల మొక్కలు నాటగా, ఈ ఏడాది 5.47 లక్షల మొక్కలు నాటేందుకు సిద్ధమైంది. ఇందులో ఖమ్మం డివిజన్‌లో 2.47 లక్షలు, సత్తుపల్లి డివిజన్‌లో 3లక్షల మొక్కలు నాటనున్నారు.

ప్రత్యేక నిధులతో అడుగులు

నూతన అడవుల పెంపకానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు మంజూరు చేస్తున్నాయి. కొత్త అడవుల పెంపకం, అటవీ భూముల పరిరక్షణ, అభివృద్ధికి క్యాంప్ (కాంపెన్సేటరీ అఫారెస్టేషన్ ఫండ్ మేనేజ్‌మెంట్ ప్లానింగ్ అథారిటీ) పథకాన్ని వినియోగిస్తున్నారు. అలాగే, పోడు, ఇతర కారణాలతో నరికేసిన అటవీ ప్రాంతాల్లో మొక్కలు నాటడం, అటవీ భూములను అభివృద్ధి చేసేందుకు అటవీ నిధుల పథకాన్ని అమలు చేస్తున్నారు. అంతేకాక క్షీణించిన అటవీ భూముల అభివృద్ధికి డీఎఫ్‌ఎల్(డీ గ్రేడెడ్ ఫారెస్ట్ ల్యాండ్) పథకం అమల్లో ఉంది. కాగా, బ్లాక్ ప్లాంటేషన్లలో నాటే మొక్కల సంరక్షణకు వాచర్ల నియామకం, ఎక్కడైనా మొక్కలు చనిపోతే కొత్తవి నాటుతుండడంతో 90–92 శాతం బతుకుతుండగా పచ్చదనం పెరుగుతోంది.

లంకపల్లి.. భేష్

సత్తుపల్లి అటవీ డివిజన్ లంకపల్లి రిజర్వ్ ఫారెస్టు పరిధి కనిగిరి కొండల్లో ఉన్న పులిగుండాల ప్రాజెక్టు వద్ద సైతం అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఇక్కడ వన్యప్రాణుల సంరక్షణతో పాటు దట్టమైన అడవుల పెంపకం కొనసాగుతోంది. రిజర్వ్ ఫారెస్టులోని గొల్లగూడెం 182 కంపార్ట్‌మెంట్లలో 2023–24లో 14 హెక్టార్లలో 15,554 నేరేడు, తెల్లమద్ది, నల్లచందుగ, ఉసిరి, వెదురు, ఇరికి మొక్కలు ఇందులో 2024–25 నాటికి 14,667 మొక్కలు(94.30 శాతం), 2025–26 సంవత్సరానికి 13,992 మొక్కలు(90 శాతం) బతికాయని తేలడం విశేషం. ఇక కేంద్రప్రభుత్వం అర్బన్ ఫారెస్టుల అభివృద్ధికి నగర్ వాన్ ఉద్యాన యోజన పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం కింద 220.95 హెక్టార్లలో ఉన్న ఖమ్మం అర్బన్ మండలంలోని వెలుగుమట్ల పార్క్‌ను అభివృద్ధి చేస్తున్నారు. ప్రత్యేక నిధులతో సిటీ ఫారెస్ట్ బ్లాక్‌గా అభివృద్ధి చేస్తూనే ఇతర చోట్ల నాటడానికి కావాల్సిన మొక్కల పెంపకానికి నర్సరీ నిర్వహిస్తున్నారు.

హరితనిధి ద్వారా అడవుల రక్షణ



ప్రభుత్వ పథకాల ద్వారా అడవుల రక్షణకు చర్యలు తీసుకుంటున్నాం. హరిత నిధి నుంచి అటవీ భూముల్లో ప్లాంటేషన్ నిర్వహించి సంరక్షిస్తున్నాం. బ్లాక్ ప్లాంటేషన్లలో ఏటా నాటే మొక్కల్లో 92 శాతం మేర మొక్కలు బతుకుతున్నాయి. మొక్కల పంపకంలో గొల్లగూడెం ఫారెస్టు గుర్తింపు సాధించింది.

– సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్, జిల్లా అటవీ అధికారి

ఈ ఏడాది 35లక్షల మొక్కలు

వన మహోత్సవంలో భాగంగా జిల్లాలో ఈ ఏడాది 35,23,300 మొక్కలు నాటాలని ప్రభుత్వం నిర్దేశించింది. అటవీ శాఖతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా నర్సరీల్లో మొక్కలు సిద్ధం చేసి శాఖల వారీగా మొక్కలు నాటడం మొదలుపెట్టారు. ఇవికాక ఇప్పటికే గుర్తించిన ప్రాంతాల్లో బ్లాక్ ప్లాంటేషన్ పేరిట నాటుతున్న మొక్కలు పెరిగి చిట్టడవులను తలపిస్తుండడంతో మరిన్ని ప్రాంతాలను ఎంపిక చేశారు.

ప్రభుత్వ చేయూతతో బలోపేతం



మహిళా సంఘాలకు రుణాల చెక్కులు అందిస్తున్న మంత్రి తుమ్మల, పక్కన కలెక్టర్ అనుదీప్, పోలీసు కమిషనర్ సునీల్‌దత్, డీఆర్‌డీఓ సన్యాసయ్య తదితరులు

● అన్ని పథకాలు మహిళల పేరుతోనే..
● ఇందిరా మహిళాశక్తి సంబురాల్లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. ఖమ్మం వెలుగుమట్ల అర్బన్ పార్క్‌లో శుక్రవారం నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ తదితరులతో కలిసి రఘునాథపాలెం మండలానికి చెందిన 934 సంఘాలకు రూ.1.18 కోట్లు, కేఎంసీ పరిధిలో 2,958 సంఘాలకు రూ.2.81 కోట్ల వడ్డీ లేని రుణాలు, పలువురు సభ్యుల బీమా చెక్కులు, ఇందిరమ్మ లబ్ధిదారులకు ఆయన ఇంటి మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతీ పథకం మహిళల పేరిటే అమలవుతున్నందున ఆర్థిక స్వావలంబన సాధించాలని సూచించారు. మహిళలు ఎదిగితే వారి కుటుంబం, తద్వారా సమాజం బాగుపడుతుందని తెలిపారు. జిల్లాలో స్వయం సహాయక సంఘాల్లో లేని వారు సభ్యులుగా చేరాలని సూచించారు. ఖమ్మం నియోజకవర్గానికి తొలి విడతగా 3,500 ఇళ్లు మంజూరు కాగా గుడిసెల్లో నివసించే వారికి ప్రాధాన్యత ఇచ్చామని తెలిపారు. కాగా, వెలుగుమట్ల అర్బన్ పార్క్‌ను హైదరాబాద్ జూలాజికల్ పార్క్ మాదిరి అభివృద్ధి చేస్తామని మంత్రి ప్రకటించారు. అలాగే, ఖిల్లా వద్ద రోప్‌వే పనులను వేగవంతం చేస్తామని తెలిపారు. కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ ఆర్టీసీ అద్దె బస్సులు, అమ్మ ఆదర్శ పాఠశాలల బాధ్యతతో పాటు యూనిఫామ్ కుట్టే పనులు కూడా మహిళా సంఘాలకు అప్పగిస్తున్నామని తెలిపారు. జిల్లాలో 9వేలకు పైగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం జరుగుతోందని, అర్హులందరికీ విడతల వారీగా ఇళ్లు అందజేస్తామని వెల్లడించారు. తొలుత మంత్రి, అధికారులు పార్క్‌లో మొక్కలు నాటగా, మహిళా సంఘాలు ఏర్పాటు చేసిన స్టాళ్లలో ఉత్పత్తులను పరిశీలించారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర విత్తన గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కేఎంసీ మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య, జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, జెడ్పీ సీఈఓ దీక్షారైనా, డీఆర్డీఓ సన్యాసయ్య, సివిల్ సప్లయీస్ డీఎం శ్రీలత, హౌజింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా, కార్పొరేటర్ రావూరి కరుణ, మార్కెట్, ఆత్మ, పీఏసీఎస్ చైర్మన్లు యరగర్ల హన్మంతరావు, దిరిశాల చిన వెంకటేశ్వర్లు తాత రఘురాం, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల సమగ్రాభివృద్ధే లక్ష్యం



భద్రాచలం: గిరిజన భవన్‌లో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి, పక్కన కలెక్టర్ పాటిల్, ఎమ్మెల్యేలు

● పినపాకలో 40 వేల ఎకరాలకు సీతారామ జలాలు
● రామాలయ అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేయాలి
● ఇందిర మహిళా శక్తి సంబరాల్లో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

భద్రాచలం/బూర్గంపాడు: మహిళల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా రాష్ట్రప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. భద్రాద్రి జిల్లా బూర్గంపాడు, భద్రాచలంలో శుక్రవారం నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావులతో కలిసి ఆయన పాల్గొన్నారు. నియోజకవర్గాల వారీగా మహిళా సంఘాల సభ్యు లకు వడ్డీ లేని రుణాల చెక్కులు అందజేశారు. అలాగే, భద్రాచలంలో రామాలయం చుట్టు పక్కల జరుగుతున్న మాడవీధుల విస్తరణ పనులను పరిశీలించారు. తొలుత గిరిజన్ భవన్‌లో మహిళలు తయారు చేసిన బిస్కెట్లను కొనుగోలు చేశారు. ఈ కార్యక్రమాల్లో మంత్రి మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల మహిళలకు గత ప్రభుత్వం పావలా వడ్డీ రుణాలు చెల్లించకుండా ఇబ్బంది పెడితే తాము అధికారంలోకి వచ్చాక రూ. 875 కోట్లు చెల్లించామని తెలిపారు.

వైఎస్సార్ ఆశయ స్ఫూర్తితో..

దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ ఆశయ స్ఫూర్తితో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మార్చాలని పట్టుదలతో పనిచేస్తున్నట్లు పొంగులేటి తెలిపారు. పినపాక నియోజకవర్గంలో సీతారామ ప్రాజెక్ట్‌తో 40 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. గోదావరి ముంపు బాధితులకు మెరక ప్రాంతంలో స్థలాలు కేటాయించి, ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని తెలిపారు. భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని అధికారులు, వైదిక కమిటీ సభ్యులకు మంత్రి శ్రీనివాసరెడ్డి సూచించారు.

నిఘా శాఖకు సొంత గూడు!

● ఇంటెలిజెన్స్ విభాగానికి మూడు భవనాలు
● ఎన్నెస్పీ క్యాంప్‌లో పూర్తయిన నిర్మాణం



ఇంటెలిజెన్స్ అడిషనల్ ఎస్పీ కార్యాలయం

ఖమ్మంక్రైం: ఉమ్మడి జిల్లా పోలీసు శాఖలో అత్యంత కీలకమైన నిఘా విభాగాని(ఇంటెలిజెన్స్)కి నూతన భవనాలు సిద్ధమయ్యాయి. ఏళ్లుగా అద్దె భవనాల్లో కొనసాగుతున్న ఈ కార్యాలయాల్లో ఉద్యోగులు ఇబ్బంది పడుతండగా ప్రభుత్వం పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా నిధులు కేటాయించింది. దీంతో ఖమ్మం నడిబొడ్డున ఎన్నెస్పీ క్యాంప్‌లో కేటాయించిన స్థలంలో భవనాలు నిర్మించి ప్రారంభానికి ముస్తాబు చేశారు.

ఏళ్ల తర్వాత...

పోలీసు శాఖలోనే కాక ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ శాఖలు, రాజకీయాల పరిస్థితిని ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదించడంలో ఇంటెలిజెన్స్ విభాగం కీలకంగా నిలుస్తుంది. కానీ ఈ శాఖ కార్యకలాపాలకు సొంత భవనాలు లేక ఏళ్ల తరబడి అద్దె భవనాల్లో కొనసాగిస్తున్నారు. అరకొర సౌకర్యాల నడుమ ఇబ్బంది పడుతూనే ఉద్యోగులు విధులు నిర్వర్తించాల్సి వస్తోంది. కాగా, గతంలో ఉమ్మడి జిల్లాకు డీఎస్పీ స్థాయి అధికారి ఇన్‌చార్జ్‌గా ఉండేవారు. ఆతర్వాత అడిషనల్ ఎస్పీ స్థాయికి అప్‌గ్రేడ్ అయింది. ఈమేరకు నూతన భవనం అవసరమని గతంలో అప్పట్లో ఇంటెలిజెన్స్‌కు అడిషనల్ ఎస్పీగా పనిచేసిన బాలకిషన్‌రావు కలెక్టర్‌కు ప్రతిపాదనలు సమర్పించారు.

సిద్ధమైన భవనాలు

అడిషనల్ ఎస్పీగా పనిచేసిన బాలకిషన్‌రావు వినతితో ఖమ్మంలోని ఎన్నెస్పీ క్యాంప్‌లో భవనాల నిర్మాణానికి 900 గజాల స్థలం కేటాయించారు. దీంతో అడిషనల్ ఎస్పీకి ఒకటి, ఇద్దరు సీఐలకు రెండు చొప్పున మొత్తం మూడు భవనాలను పోలీస్ హౌజింగ్ సొసైటీ ద్వారా నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం అడిషనల్ ఎస్పీ రామోజీ రమేష్ పర్యవేక్షణలో నిర్మాణ పనులు చివరి దశకు చేరగా, ప్రహరీ నిర్మాణానికి ఇంకొంత స్థలం అవసరమని కలెక్టర్‌ను కోరడంతో సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది. ప్రస్తుతం పూర్తయిన భవనాల్లో ఒకటి అడిషనల్ ఎస్పీతో పాటు ఆయన కార్యాలయ సిబ్బందికి, ఇద్దరు సీఐలు, సిబ్బంది విధులు నిర్వహించేలా చెరో భవనం కేటాయించనున్నారు. కాగా, ఈ మూడు భవనాలను త్వరలోనే ఇంటెలిజెన్స్ అడిషనల్ డీజీ చేతుల మీదుగా ప్రారంభానికి సన్నాహాలు చేస్తున్నారు.

ప్రజలు ఓటేస్తే.. కాంగ్రెస్ కాటేసింది

అలవి కాని హామీలతో గెలిచిన కాంగ్రెస్

● ఉమ్మడి జిల్లా రాజకీయ సమీకరణలతో మేం నష్టపోయాం..
● స్థానిక ఎన్నికల్లో కార్యకర్తలు కథానాయకులై కదలాలి
● మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



మాట్లాడుతున్న మాజీ మంత్రి కేటీఆర్, పక్కన మంత్రులు పువ్వాడ అజయ్, సత్యవతి, ఎంపీ రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర, కొండబాల, చంద్రావతి తదితరులు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఎన్నికల్లో అలవికాని హామీలు ఇచ్చిన కాంగ్రెస్‌ను నమ్మి ప్రజలు ఓటేస్తే.. వాటిని అమలు చేయకుండా ప్రజలను ప్రభుత్వం కాటేసిందని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు పేర్కొన్నారు. ఖమ్మంలో శుక్రవారం ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ బ్రహ్మాండంగా భోజనం పెడుతున్నా ఈయనెవరో బిర్యానీ పెడతానంటున్నడుగా అని కాంగ్రెస్‌కు ఓటేశారని తెలిపారు. కానీ ప్రజలకు ఇప్పుడు అసలు విషయం అర్థమైనందున, ఇప్పుడు ఎన్నికలు వస్తే ఏం జరుగుతుందో రేవంత్‌రెడ్డికి తెలుసునన్నారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పి.. వాటిని బొంద పెడతారని ప్రజలు ఊహించక ఒక్క తప్పు ఓటు వేసినందుకు పదేళ్ల శిక్ష పడిందని పేర్కొన్నారు.

రెండుసార్లు అవకాశం ఇచ్చారు..

తెలంగాణ ప్రజలు రెండు సార్లు బీఆర్‌ఎస్‌కు అవకాశం ఇచ్చారని కేటీఆర్ పేర్కొన్నారు. కేసీఆర్ నాయకత్వాన కొత్త రాష్ట్రంలో బుడిబుడి అడుగులు వేస్తూనే.. మరోవైపు పటిష్టమైన పునాది వేసేలా నిర్మాణాత్మకంగా, ప్రణాళికాయుతంగా పదేళ్లు పనిచేశామని తెలిపారు. తద్వారా వ్యవసాయం, సాగునీరు, పట్టణ, పల్లె అభివృద్ధి, విద్య, వైద్యం, గిరిజన, దళితుల, బలహీన వర్గాలు, మహిళలు, మైనార్టీల సంక్షేమం తదితర రంగాల్లో దేశంలోనే ఆదర్శంగా నిలిపామన్నారు. తద్వారా 2014లో కేవలం 63 సీట్లు సాధించిన బీఆర్‌ఎస్‌కు 2018లో ప్రజలు 88 సీట్లు కట్టబెట్టారని తెలిపారు.

హామీలు ఊదరగొట్టి..

పదేళ్లపాటు బీఆర్‌ఎస్ అద్భుత పాలన అందించాక 2023లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు ప్రజలను ఆకర్షించాయని కేటీఆర్ చెప్పారు. నోటికి వచ్చినట్లుగా హామీల వర్షం కురిపించి రైతు డిక్లరేషన్, బోనస్ పేరిట బోగస్ మాటలు చెప్పారన్నారు. బీసీ డిక్లరేషన్, రైతు భరోసా, ఉద్యోగాల కల్పన, యువతుల పెళ్లికి తులం బంగారం తదితర ఈస్ట్‌మన్ కలర్ సినిమాను నమ్మడంతో ప్రజలు మోసపోయారని చెప్పారు.


ప్రతినాయకుడు ఉంటేనే..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రాజకీయ సమీకరణాల్లో భాగంగా 2023లో నష్టం జరిగిందని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. అన్నీ సవ్యంగా సాగితే జీవితం విలువ అర్థం కాదని, చుట్టూ ఉండే మనుషుల విలువ, నాయకుడి విలువ తెలియాలన్నా ప్రతినాయకుడు ఉండాల్సిందేనని చెప్పారు. జిల్లాలో ముగ్గురు మంత్రుల్లో ఒకాయన చెప్పిన బాంబులు ఇప్పటికీ పేలలేదన్నారు. ఇంకొకరు కమీషన్లలో బిజీగా ఉంటే, మరొకరు వ్యవసాయ మంత్రిగా ఏం చేస్తున్నాడో తెలియడం లేదని చెప్పారు. రైతులు ఎరువుల దుకాణాల ముందు లైన్లలో చెప్పులు పెడుతుండడం ప్రభుత్వ పాలనకు అద్దం పడుతోందని తెలిపారు.

మీ కోసం మేం కష్టపడతాం..

గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో నాయకుల కోసం కార్యకర్తలు కష్టపడ్డారని, ఇప్పుడు కార్యకర్తల కోసం నాయకులు కష్టపడతారని కేటీఆర్ వెల్లడించారు. ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉన్నందున కష్టపడి పనిచేస్తే ఖమ్మం, భద్రాద్రి జెడ్పీలు, ఎంపీటీసీ, కౌన్సిలర్లు, కార్పొరేటర్ స్థానాలన్నీ గెలవొచ్చని తెలిపారు. మున్సిపాలిటీలు, ఎంపీపీ స్థానాల్లోనూ యువకులు ముందుకొచ్చి కాంగ్రెస్‌ను చీల్చి చెండాడాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ మోసాన్ని గ్రామగ్రామాన ఎండగట్టేలా మరో కేసీఆర్‌లా కథానాయకులై కదలాలన్నారు. ఈ సమావేశంలో మాజీ మంత్రులు పువ్వాడ అజయ్‌కుమార్, సత్యవతి రాథోడ్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, బానోతు చంద్రావతి, కొండబాల కోటేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు, జెడ్పీ, డీసీసీబీ మాజీ చైర్మన్లు లింగాల కమల్‌రాజు, కూరాకుల నాగభూషణం, నాయకులు బొమ్మెర రామ్మూర్తి, గుండాల కృష్ణ, పగడాల నాగరాజు, ఖమర్, తాజుద్దీన్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

స్వర్ణ కవచధారణలో రామయ్య



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలంలో శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థాన అంతరాలయంలో మూలమూర్తులు శుక్రవారం స్వర్ణ కవచధారులై దర్శనమిచ్చారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీరిన స్వామికి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించిన అర్చకులు నిత్యకల్యాణ ఘట్టాన్ని జరిపారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

క్లుప్తంగా

21న ఖమ్మం మార్కెట్‌కు సెలవు

ఖమ్మంవ్యవసాయం: ఆషాఢమాసం బోనాల పండుగ సందర్భంగా సోమవారం(21న) ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు సెలవు ప్రకటించినట్లు ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈ విషయాన్ని రైతులు గమనించాలని కోరారు. తిరిగి మంగళవారం యథాతథంగా పంటల కొనుగోళ్లు జరుగుతాయని పేర్కొన్నారు.

బ్రిడ్జి నిర్మించాలని రైతుల ఆందోళన



హైవే వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

చింతకాని: మండలంలోని బస్వాపురంలో దేవరపల్లి–సూర్యాపేట జాతీయ రహదారి వద్ద శుక్రవారం రైతులు ఆందోళన చేపట్టారు. హైవే నిర్మాణంతో ఎన్నెస్పీ చింతకాని మేజర్‌పై ఉన్న రహదారి మూసుకుపోగా, కాల్వపై బ్రిడ్జి నిర్మించడం లేదని ఆరోపించారు. రైతులు ఇబ్బందుల దృష్ట్యా కాల్వలకు నీటి విడుదల కాకముందే బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. రైతులు కన్నెబోయిన గోపి, బొడ్డు వెంకట రామారావు, ముప్పారపు సైదులు, బొడ్డు సంజీవరావు, కన్నెబోయిన పాండురంగారావు, బొడ్డు శ్రీనివాసరావు, దాసరి శ్రీనివాసరావు, పోట్నీడు రవీంద్రబాబు, బొంతు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌పై కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు

రఘునాథపాలెం: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని అసభ్య పదజాలంతో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దూషించినందున, ఆయనపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండలంలోని కే.వీ.బంజరకు చెందిన కాంగ్రెస్ మాలోతు రాము, రామ్మూర్తి, నాయకులు శుక్రవారం రఘునాథపాలెం సీఐ ఉస్మాన్ షరీఫ్‌కు ఫిర్యాదు అందజేశారు.

యూరియా కోసం రైతుల తిప్పలు



రైతులకు నచ్చచెబుతున్న ఏఓ వినయ్

బోనకల్: మండలంలోని రావినూతల పీఏసీఎస్ వద్ద శుక్రవారం రైతులు యూరియా కోసం పడిగాపులు కాయాల్సి వచ్చింది. సహకార సంఘానికి 25 మెట్రిక్ టన్నుల యూరియా రావడం.. గురువారం రాత్రి వర్షం కురిసిన నేపథ్యాన పత్తి చేన్లలో చల్లేందుకు యూరియా కోసం రైతులు చేరుకున్నారు. పలువురు సీఈఓ కార్యాలయంలోకి దూసుకెళ్లి వాదనకు దిగడంతో ఉద్రిక్తత నెలకొంది. దీంతో ఏఓ పసులూరి వినయ్‌కుమార్ వచ్చి రైతులతో మాట్లాడారు. యూరియాతో పాటు నానో యూరియా కూడా అందుబాటులో ఉన్నందున ఎవరూ ఆందోళన చెందొద్దని సర్దిచెప్పారు.

కేటీఆర్ పర్యటనలో సీఐ!

ఖమ్మంక్రైం: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుక్రవారం ఉమ్మడి ఖమ్మం జిల్లా పర్యటన కోసం హెలీకాప్టర్‌లో రాగా, హెలీప్యాడ్ వద్ద ఓ సీఐ కనిపించడం చర్చనీయాంశంగా మారింది. వివాదాస్పదుడిగా ముద్ర పడిన ఆ సీఐ భద్రాద్రి జిల్లా డీసీఆర్‌బీలో విధులు నిర్వర్తిస్తున్నాడు. బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి సివిల్ డ్రస్‌లో హెలీప్యాడ్ వద్ద వేచి ఉండడాన్ని గుర్తించారు. గతంలో ఖమ్మం రూరల్ సీఐగా విధులు నిర్వర్తించినప్పుడు ఆయన బీఆర్‌ఎస్ నాయకుల సూచనలతో ఇతర పార్టీల నేతలను వేధించాడనే విమర్శలు ఎదుర్కొన్నారు. ఈ విషయమై సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా కూనంనేని సాంబశివరావు గతంలో ఘాటుగా స్పందించారు. ఇప్పుడు ఆయన కేటీఆర్ పర్యటనలో పాల్గొనడం పోలీసు వర్గాల్లో చర్చకు దారి తీసింది. ఉన్నతాధికారుల అనుమతితో వచ్చాడా, లేదా అన్నది తెలియరాలేదు. అయితే, గతంలో సిరిసిల్లలో పనిచేసినప్పుడు కేటీఆర్‌తో ఉన్న సంబంధాల కారణంగానే వచ్చి ఉంటాడని మరికొందరు చెబుతున్నారు.

కన్సాలిడేటెడ్ లెక్చరర్ తొలగింపు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధి ఖమ్మంలోని ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజీలో కన్సాలిడేటెడ్ లెక్చరర్‌గా పనిచేస్తున్న శ్రీనివాసరావును టర్మినేషన్(ఉద్యోగంలో నుంచి తొలగింపు) చేస్తూ రిజిస్ట్రార్ వి.రామచంద్రం ఈనెల 1న జారీ చేసిన ఉత్తర్వులు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. విద్యార్థినులతో శ్రీనివాసరావు అసభ్యంగా ప్రవర్తించారనే ఆరోపణలతో ఈ ఏడాది జనవరిలో విచారణ కమిటీని నియమించారు. కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం ప్రొఫెసర్ వరలక్ష్మి చైర్మన్‌గానే కాక మరికొందరు సభ్యులతో నియమించిన కమిటీ విచారణ పూర్తిచేసిన నివేదికను అధికారులకు అందజేసింది. దీంతో కన్సాలిడేటెడ్ లెక్చరర్ శ్రీనివాసరావుకు రిజిస్ట్రార్ రామచంద్రం షోకాజ్ నోటీస్ జారీచేశారు. ఆ నోటీసుకు అందిన వివరణ సంతృప్తికరంగా లేకపోవడంతో శ్రీనివాసరావును విధుల నుంచి టర్మినేషన్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయాన్ని రిజిస్ట్రార్ శుక్రవారం 'సాక్షి'తో ధ్రువీకరించారు.

'రామదాసు'తో సాగు కళకళ

- పాలేరు నియోజకవర్గంలో 71వేల ఎకరాలకు నీరు
- 213 చెరువులు 50శాతం మేర నింపేలా ప్రణాళిక
- ఉత్సాహంగా వరినాట్లకు సిద్ధమవుతున్న రైతాంగం
- వైఎస్సార్ హయాంలో నిర్మించిన కాల్వల్లో పారుతున్న జలాలు



ఇస్లావత్‌తండా వద్ద భక్తరామదాసు ఎత్తిపోతల పథకం నుంచి విడుదలవుతున్న నీరు

తిరుమలాయపాలెం: కరువు కాటకాలతో అల్లాడిన ప్రాంతం పాలేరు నియోజకవర్గం ఇప్పుడు భక్త రామదాసు ఎత్తిపోతల పథకంతో సస్యశ్యామలంగా మారుతోంది. ప్రాజెక్టు నీటితో చెరువులు, కుంటలు నిండగా.. బోర్లు, బావుల్లో భూగర్భ జలాలు పెరిగి వరుణుడి కరుణ లేకున్నా రైతులు సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. ఒకప్పుడు కరువుతో అల్లాడిన తిరుమలాయపాలెం, కూసుమంచి మండలంలోని కొన్ని ప్రాంతాల్లో ఇప్పుడు సాగునీటి కొరత లేకపోవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర రెడ్డి హయాంలో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కోసం తవ్విన కాల్వలు ఇప్పుడు భక్త రామదాసు ప్రాజెక్టు విజయవంతానికి తోడ్పాటునివ్వడం విశేషం. తిరుమలాయపాలెం మండలం ఇస్లావత్‌తండా వద్ద ఈ ప్రాజెక్టు నుంచి విడుదలయ్యే పాలేరు జలాలు ఎస్సారెస్పీ కాల్వల ద్వారా నాలుగు మండలాలకు చేరుతున్నాయి.

అరకొర వర్షాలైనా సరే..

ఈ ఏడాది ఇప్పటివరకు సరిపడా వర్షాలు లేక, బావులు, బోర్లలోనూ భూగర్భ జలాల కొరతతో వరి, మిర్చి సాగుకు ఇబ్బంది ఎదురవుతోంది. ఇంతలోనే పాలేరు నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచనలతో భక్తరామదాసు ఎత్తిపోతల పథకం నుంచి నీరు విడుదల చేయగా... రైతులు వరి నాట్లకు సిద్ధమవుతున్నారు. అలాగే, మిగిలిన ఆరుతడి పంటలకు సైతం ఇబ్బంది ఉండదని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా తిరుమలాయపాలెం, కూసుమంచి, ఖమ్మం రూరల్, నేలకొండపల్లి మండలాల్లో 213 చెరువులు నింపడం ద్వారా 71,927 ఎకరాలకు సాగునీరు అందనుంది. అంతేకాక మధిర నియోజకవర్గంలోని ముదిగొండ మండలంలో 2,440 ఎకరాలకు సాగునీరు అందుతుంది.



సుబ్లేడులో వరినాట్లు వేస్తున్న కూలీలు



కళకళలాడుతున్న బీరోలు పెద్దచెరువు

మండలాల వారీగా నీరు అందనున్న భూమి

మండలం	భూమి (ఎకరాల్లో)
తిరుమలాయపాలెం	30,143
కూసుమంచి	25,179
ఖమ్మం రూరల్	12,605
నేలకొండపల్లి	4,000
ముదిగొండ	2,440

అన్ని చెరువులకు నీరు అందేలా...

భక్తరామదాసు ఎత్తిపోతల పథకం ద్వారా సాధ్యమైనంత మేర అన్ని చెరువులు నింపేందుకు మంత్రి పొంగులేటి ఆదేశాలతో జల వనరుల శాఖ అధికారులు గత ఏడాదే అవసరమైన చోట కాల్వలు, యూటీల నిర్మాణంతో పాటు గేట్‌వాల్స్ ఏర్పాటుచేశారు. వర్షాభావ పరిస్థితులతో ఈసారి విడుదల చేసిన నీరు చెరువులకు చేరింది. దీంతో రైతులు బీడు భూములను సైతం సాగులోకి తెచ్చి వరి, ఇతర వాణిజ్య పంటలు సాగుచేస్తున్నారు. గతంలో ఒకే పంటకు పరిమితమైన వారు రెండు పంటలు పండిస్తామని చెబుతున్నారు. కాగా, రబీలోనూ వరి, మొక్కజొన్న, పెసర, వేరుశనగ తదితర పంటలను సాగు చేస్తున్నందున దఫాల వారీగా నీరు విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

మత్స్యకారుల ఆర్థికాభివృద్ధి

గతంలో చెరువుల్లో నీరు లేక మత్స్యకార్మికులు చేపల పెంపకానికి ఇబ్బంది పడేవారు. కానీ ఈసారి వర్షాలు లేకున్నా భక్త రామదాసు ప్రాజెక్టు నుంచి 213చెరువులకు నీరు చేరింది. ఫలితంగా చేపల పెంపకానికి ఇక్కట్లు ఉండవని సంతోషం వ్యక్తం చేస్తున్న వారు చేపపిల్లలు కూడా పంపిణీ చేస్తే ప్రయోజనం ఉంటుందని చెబుతున్నారు.

అన్ని చెరువుల్లో 50శాతం..



వర్షాభావ పరిస్థితులతో వరి, ఇతర పంటల సాగుకు ఇబ్బంది రాకుండా భక్త రామదాసు ప్రాజెక్టు నుంచినీరు విడుదల చేశారు. పది రోజుల పాటు నీరు విడుదల చేస్తూ అన్ని చెరువును 50శాతం మేర నింపుతాం. వర్షాలతో మరికొంత నీరు చేరితే సాగుకు ఇబ్బందులు ఉండవు.

– బాణాల రమేష్‌రెడ్డి, డీఈ, జలవనరుల శాఖ

రెండు పంటల సాగు..



గతంలో వర్షాభావ పరిస్థితులతో ఒక్క పంట కూడా సరిగా పండేది కాదు. కానీ ఇప్పుడు భక్తరామదాసు నీటితో చెరువులు నింపడంతో భూ గర్భ జలాలు పెరుగుతున్నాయి. ఫలితంగా రెండు పంటలు సాగు చేస్తాం. ఏటా ఇదే మాదిరి సాగునీరు అందిస్తే ఫలితం ఉంటుంది.

– సొంతి వెంకటేశ్వర్లు, రైతు, ఎదుళ్లచెరువు, తిరుమలాయపాలెం మండలం

కష్టాలు తొలగినట్టే..



గతంలో కరువు పరిస్థితులతో బావులు, బోర్ల కోసం రూ.లక్షలు ఖర్చు చేశాం. భక్త రామదాసు ప్రాజెక్టు ద్వారా పాలేరు జలాలను మా ప్రాంతంలోని చెరువుల్లో నింపడంతో భూగర్భ జలాలు పెరిగి సాగునీటి కష్టాలు తొలగాయి. ఇక సాగుకు ఎలాంటి అవరోధాలు ఉండవు.

– కంభం చిరంజీవి, రైతు, పోచారం, కూసుమంచి మండలం

టీచర్లు.. అటూఇటు

- ఉపాధ్యాయుల సర్దుబాటుకు ప్రణాళిక
- ఈనెల 28వ తేదీలోగా పూర్తికి సన్నాహాలు
- విద్యార్థుల సంఖ్య ఆధారంగా అడ్జస్ట్‌మెంట్



ఖమ్మం సహకారనగర్: ఈ విద్యాసంవత్సరం అవసరమైన ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కేటాయింపునకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా అదనంగా ఉన్నచోట్ల నుంచి అవసరమైన పాఠశాలలకు ఉపాధ్యాయులను సర్దుబాటు(వర్క్ అడ్జస్ట్‌మెంట్) చేయనున్నారు. అయితే, గత ఏడాది మూడుసార్లు టీచర్ల సర్దుబాటు చేసినా చివరి సమయంలో పలు సబ్జెక్టులు బోధించేందుకు ఉపాధ్యాయుల కొరత ఏర్పడింది. ఈసారి అలా జరగకుండా పకడ్బందీగా నిర్వహించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు.

858 పోస్టులు ఖాళీ

జిల్లాలో 1,216 పాఠశాలలు ఉండగా సుమారు 68వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. జిల్లాకు కేటాయించిన 5,815 ఉపాధ్యాయ పోస్టుల్లో 4,957మందే విధులు నిర్వర్తిస్తుండగా 858 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అంతేకాక ఈనెలలో 10 – 20మంది వరకు ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈనేపథ్యాన ఈనెల 15వ తేదీ నాటికి నమోదైన విద్యార్థుల సంఖ్యను పరిగణనలోకి తీసుకుని 28వ తేదీకల్లా ఉపాధ్యాయుల సర్దుబాటు(వర్క్ అడ్జస్ట్‌మెంట్) పూర్తిచేయాలన్న ప్రభుత్వ ఆదేశాలతో యంత్రాంగం సిద్ధమవుతోంది. కాగా, జిల్లాలో గ్రేడ్–2 హెచ్‌ఎం పోస్టులు 33 ఖాళీలు ఉన్నాయి. అలాగే, స్కూల్ అసిస్టెంట్ (ఎస్‌ఏ) మ్యాథ్స్ 22, ఫిజిక్స్ 20, బయాలజీ 54, ఇంగ్లిష్ 29, సోషల్ 72, తెలుగు 37, హిందీ 29తో పాటు ఇంకొన్ని పోస్టులు ఖాళీగా ఉండడం బోధనకు ఆటకంగా మారుతున్న నేపథ్యాన వర్క్ అడ్జస్ట్‌మెంట్ కీలకంగా నిలవనుంది.

గతేడాది ఇలా...

గతేడాది వివిధ సబ్జెక్టుల ఉపాధ్యాయులు 165మందిని సర్దుబాటు చేశారు. ఇందులో 40మంది ఎస్‌జీటీలూ ఉన్నారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్, ఫిజిక్స్, బయాలజీ సైన్స్, సోషల్ టీచర్లకు అవసరమైన చోటకు కేటాయించారు. అయితే, సుదూర ప్రాంతాల్లో విధులు నిర్వర్తించే ఉపాధ్యాయులు సమీప ప్రాంతాలకు వచ్చేందుకు ఆసక్తి కనబరిచారు. అయితే, గత ఏడాది ఉద్యోగ విరమణ తేదీని పరిగణనలోకి తీసుకోకపోవడంతో వారు రిటైర్‌కాగానే మళ్లీ ఖాళీలు ఏర్పడ్డాయి. దీంతో మూడుసార్లు సర్దుబాటు చేయడం విమర్శలకు తావిచ్చింది.

ఆ అనుభవాలు పరిగణనలోకి తీసుకుంటేనే...

గత విద్యాసంవత్సరం మూడు సార్లు టీచర్ల సర్దుబాటు చేసినా చివరి సమయంలో సబ్జెక్ట్ టీచర్ల కొరతతో విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. దీంతో ఈసారైనా మార్చి వరకు ఉద్యోగ విరమణ చేసే వారిని కాకుండా మిగతా వారిని పరిగణనలోకి తీసుకోవాలని విద్యావేత్తలు సూచిస్తున్నారు. ఈసారి 200మంది వరకు కీలక సబ్జెక్టు టీచర్ల సర్దుబాటుకు అవకాశం ఉండగా... సుదూర ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తున్న 350మంది ఖమ్మం, సమీప ప్రాంతాలకు వచ్చే ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఈనేపథ్యాన జిల్లాలో టీచర్ల అడ్జస్ట్‌మెంట్ అంశంపై సమీక్షించేందుకు అదనపు కలెక్టర్ శ్రీజ విద్యాశాఖ అధికారులతో చర్చించనున్నట్లు తెలిసింది.

సాఫీగా జరిగేలా..



జిల్లాలో ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియపై దృష్టి సారించాం. ఇప్పటికే ఎంఈఓల ద్వారా వివరాల సేకరణ మొదలైంది. ఎక్కడెక్కడ టీచర్ల కొరత ఉందో పరిగణనలోకి తీసుకున్నాక అదనపు కలెక్టర్ శ్రీజ ఆదేశాలతో అడ్జస్ట్‌మెంట్ చేయనున్నాం.

– ఎస్.సత్యనారాయణ, జిల్లా విద్యాశాఖాధికారి



ఖమ్మంలోని మున్నేటిపై ప్రకాష్‌నగర్ చెక్ చెక్‌డ్యామ్ వద్ద గుర్రపుడెక్క విపరీతంగా పెరిగింది. చెక్‌డ్యామ్‌పై గుర్రపుడెక్క నిలవగా.. కింది భాగంలో గుర్రపుడెక్క మాత్రం ఎండిపోయింది. ఎండిపోయిన చోట మట్టిని తలపిస్తుండడంతో దూరం నుంచే చూసేవారికి రహదారిలా కనిపిస్తుండడంతో ఆశ్చర్యంగా పరిశీలిస్తూ ఫొటోలు దిగుతున్నారు. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్

చకచకా సింథటిక్ ట్రాక్ నిర్మాణం



డ్రెయినేజీ వెంట మట్టి చదును చేస్తున్న దృశ్యం

జిల్లాలో అథ్లెటిక్స్ క్రీడాకారులకు మెరుగైన శిక్షణ ఇచ్చేలా సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్మిస్తున్న సింథటిక్ ట్రాక్ మరో నాలుగు నెలల్లో అందుబాటులోకి వచ్చే అవకాశముంది. ట్రాక్ నిర్మాణానికి రూ.8.35 కోట్లు కేటాయించగా పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే 400 మీటర్స్ ట్రాక్ కోసం మొదటి దశ పనులు పూర్తి చేయగా.. ఒకటి, రెండో రోజుల్లో కాంక్రీట్ పనులు పూర్తవుతాయి. తొలుత ట్రాక్ ప్రతిపాదిత ప్రదేశంలో తవ్వి కంకరను నింపి రోలింగ్ చేశారు. ఆపై భారీ వర్షం వచ్చినా ట్రాక్‌పై నీరు నిలవకుండా చుట్టూ డ్రెయినేజీలు నిర్మిస్తున్నారు. ట్రాక్ నిర్మాణం వేగంగా జరుగుతుండడం.. నాలుగు నెలల్లో అందుబాటులోకి రానండడంతో అథ్లెటిక్స్ క్రీడాకారులకు మెరుగైన శిక్షణ అందనుంది. – ఖమ్మం స్పోర్ట్స్



ట్రాక్ నిర్మాణానికి కాంక్రీట్ వేసి రోలింగ్ చేసిన ప్రాంతం

మంటల్లో టాటా ఏస్ దగ్ధం



మంటల్లో కాలిపోతున్న వాహనం

నేలకొండపల్లి: ఇంజన్ వేడెక్కడానికి తోడు షార్ట్ సర్క్యూట్ కారణంగా వాహనం కాలిపోయింది. హైదరాబాద్‌కు చెందిన టాటా ఎస్ డ్రైవర్ ఆజాద్ శుక్రవారం ఖమ్మం నుంచి కోదాడ మీదుగా హైదరాబాద్‌కు వెళ్లేందుకు నేలకొండపల్లి మీదుగా బయలుదేరారు. ఈక్రమంలో పైనంపల్లి టోల్‌గేట్ వద్ద ఇంజన్ వేడికి తోడు షార్టు సర్క్యూట్ జరగడంతో మంటలు మొదలయ్యాయి. దీంతో డ్రైవర్ వాహనాన్ని పక్కన నిలిపి దిగగానే టాటా ఏస్ పూర్తిగా కాలిపోయింది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో అగ్నిమాపక శాఖ సిబ్బంది చేరుకుని మంటలను అదుపు చేశారు.

సమస్యల పరిష్కారానికి పోరాడుదాం



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మి

ఖమ్మంమయూరిసెంటర్: మహిళలపై నేటికీ వివక్షత కొనసాగుతున్నందున సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేయాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి సూచించారు. అన్నారు. ఐద్వా జిల్లా రాజకీయ శిక్షణ తరగతులు శుక్రవారం ఖమమంలోని సుందరయ్య భవనంలో నిర్వహించగా ఆమె మాట్లాడారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మహిళలపై అత్యాచారాలు, హత్యలు, హింస పెరుగుతోందని, సనాతన ఆచారాల పేరుతో వంటింటికే పరిమితం చేస్తున్నారని తెలిపారు. అలాగే, మోడీ అధికారంలోకి వచ్చాక 100 రోజుల్లో ధరలు తగ్గిస్తానన్న హామీ నెరవేరక మహిళలు పౌష్టికాహారానికి దూరమవుతున్నారని చెప్పారు. ఈమేరకు బీజేపీ విధానాలను మహిళలు వ్యతిరేకించాలని సూచించారు. కాగా, ఆహార భద్రత చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, మహిళల వైద్యానికి కేంద్ర బడ్జెట్‌లో రూ.2 లక్షల కోట్లు కేటాయించాలని, మహిళల సాధికారతకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఇక రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామంటున్న సీఎం, మంత్రులు ఎవరికీ ఉపాధి కల్పించకుండా హామీని ఎలా నెరవేరుస్తారని ప్రశ్నించారు. కాగా, మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న తీన్మార్ మల్లన్న తీరు మార్చుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు బుగ్గవీటి సరళ, మాచర్ల భారతి, నాగసులోచన, ప్రభావతి, కరుణ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో ఏసీబీ సోదాలు

పాల్వంచలో ఆకస్మిక తనిఖీ



కమిషనర్ సుజాత గదిలో విచారణ చేస్తున్న డీఎస్పీ రమేశ్, అధికారులు

పాల్వంచ: పాల్వంచ మున్సిపల్ డివిజన్ కార్యాలయంలో మరోసారి ఏసీబీ తనిఖీలు చేపట్టడం కలకలం రేపింది. ఏసీబీ డీఎస్పీ ఐ.రమేశ్ ఆధ్వర్యంలో శుక్రవారం కార్యాలయానికి చేరుకున్న అధికారులు గేట్లు, తలుపులు మూసివేయించారు. తొలుత మొదటగా మేనేజర్ ఎల్‌వీ.సత్యనారాయణతో మాట్లాడారు. అనంతరం కొత్తగూడెం కార్పొరేషన్ కమిషనర్ కె.సుజాత చేరుకోగా, ఆమెతో పాటు ఇతర సిబ్బందిపై విచారణ చేపట్టారు. కార్యాలయంలో ఇటీవల జరిగిన పలు అభివృద్ధి పనులు, ఆరోపణలపై ఫిర్యాదులు రావడంతో తనిఖీలు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. ఈక్రమంలో ఉద్యోగుల వద్ద అనధికారికంగా ఉన్న రూ.40 వేల నగదును సైతం సీజ్ చేశారు.

ఉదయం నుంచి రాత్రి వరకు విచారణ

ఉదయం 11.30 గంటల సమయంలో కార్యాలయానికి చేరుకున్న ఏసీబీ అధికారులు కార్యాలయంలో పలు రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కమిషనర్ గదిలోకి రికార్డులు తెప్పించుకుని పరి శీలించారు. ఇటీవల మున్సిపాలిటీలో జరిగిన అభివృద్ధి పనుల్లో అవకతవకలు జరిగాయని, బినామీల పేరుతో అధికారులే పనులు చేపట్టారనే ఆరోపణలు రావడం, అడ్డగోలుగా బిల్లులు చేసి నిధులు పక్కదోవ పట్టించారనే ఫిర్యాదుల నేపథ్యాన పూర్తి వివరాలు ఆరా తీశారని తెలిసింది. ఈక్రమాన ప్రైవేట్ ఉద్యోగులు, డ్రైవర్లు, అటెండర్లు, ఇతర సిబ్బంది ఉద్యోగుల ఫోన్ పే, గూగుల్ పే, ఖాతాల ద్వారా జరిగిన లావాదేవీలను సైతం క్షుణ్ణంగా పరిశీలించగా కొందరి ఫోన్లలో నగదు బదిలీలు జరిగినట్లు గుర్తించారు. ఈ విషయమై డీఎస్పీ రమేష్ మాట్లాడుతూ కార్యాలయంలో ఇటీవల జరిగిన అనేక పనుల విషయంలో జరిగిన అవకతవకలు, ప్రైవేట్ వ్యక్తులతో చేస్తున్న అక్రమార్జనపై ఫిర్యాదులు రావడంతో విచారణ చేపట్టామని తెలిపారు. పూర్తి వివరాలతో ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామని వెల్లడించారు.

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

మధిర: మధిర రైల్వేస్టేషన్ సమీపాన శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తి (55) రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈమార్గంలో వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైలుకింద పడి సదరు వ్యక్తి బలవన్మరణానికి పాల్పడినట్లు గుర్తించామని జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ ఎస్.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. అయితే, ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్కే ఫౌండేషన్ నిర్వాహకుల సహకారంతో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు వెల్లడించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



నాగరాజు (ఫైల్)

ఎర్రుపాలెం: మండలంలోని విద్యానగర్‌కు చెందిన మునగాల నాగరాజు(25) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. గ్రామ సమీపంలోని పెట్రోల్ బంక్ పక్కన చెట్ల పొదల్లో ఆయన మృతదేహాన్ని స్థానికులు శుక్రవారం గుర్తించారు. నాగరాజుకు భార్య ఉండగా, ఇటీవల అత్తగారింటికి వెళ్లిన ఆయన మృతదేహమై కనిపించాడు. మృతదేహం కొంత మేర కుళ్లిపోయి దుర్వాసన వస్తుండడంతో మధిర రూరల్ సీఐ మధు, ఎస్‌ఐ ఆర్.రమేష్ చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి..



బాలకృష్ణ (ఫైల్)

మధిర: కోదాడ సమీపాన ఈనెల 29న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మధిరకు చెందిన దంత వైద్యుడు భార్గవ్ మిర్యాలగూడలోని ఒక ఆస్పత్రిలో శస్త్రచికిత్స చేసి అసిస్టెంట్ బాలకృష్ణ(32)తో కలిసి కారులో తిరిగి మధిర బయలుదేరాడు. అయితే, కోదాడ సమీపాన వర్షం కారణంగా ఎదురుగా వస్తున్న లారీ కనిపించకపోవడంతో ఢీకొట్టారు. ఈ ఘటనలో బాలకృష్ణకు తీవ్రంగా, భార్గవ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఈమేరకు బాలకృష్ణను ఖమ్మంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు.